
కట్టుకోలు సుబ్బారెడ్డి




# కళ్ళ కలకేస్వరరావు

(పాఠకులు కొంచెంసేపు నవ్వుకోవాలన్న సదాశయంతో ఇలా రాశాను తప్ప ఏ ఒక్కరినీ కూడా చిన్నబుచ్చాలనో, నొప్పించాలనో కాదు. అలాంటి భావన ఎవరికైనా కలిగితే దయతో క్షమించమని కోరుతున్నాను.

-రచయిత)

"హలో..హలో..అయ్యా! అది 'ఈక్షణం' రేడియోయేనాండీ?"

"హలో..అవునండీ, ఈరోజు చాలా శుభదినమండీ..ఎందుకంటే ఈ రోజునే మేము ప్రయోగాత్మకంగా మొదలుపెట్టిన, 'ప్రతిరోజూ-ప్రతిరోగీ' అనే ప్రోగ్రాముకు ముందుగా మీకు స్వాగతం పలుకుతున్నాను. ఈ కార్యక్రమంలో- మీరే మా మొట్టమొదటి 'కాలరు'. మొట్టమొదటి 'కాలరు'గా మీకు మా స్టేషను డైరెక్టరుగారి తరఫునా, మా స్టేషను స్టాఫుతరఫునా, ఈ ప్రోగ్రాము సమర్పిస్తున్న 'చెవినిండా' టెలిఫోను కంపెనీవారి తరఫునా, ఈ ప్రోగ్రామును వింటున్న మా శ్రోతల తరఫునా, నా తరఫునా, శుభాభినందన కుసుమాలను అందజేస్తున్నాము. అంతేగాక మా ఇతర శ్రోతలకు కూడా 'చెవినిండా' టెలిఫోనువారి తరఫున శుభాభినందనాల నర్పిస్తున్నాను. మీ అందరకూ ఈ ప్రోగ్రాము నచ్చాలని కోరుకుంటున్నాను. నచ్చుతుందనే నా ప్రగాఢ విశ్వాసాధిక్యతను, వినమ్రంగా వెల్లడిస్తున్నాను."

"హలో..అయ్యా! కార్యక్రమం పేరు 'ప్రతిరోజూ..ప్రతిరోగీనా'?...అది సరే నన్ను 'కాలరు' అంటారేమిటండీ, అయినా నేను నా ఇష్టమైతే కాలతాను నాకు ఇష్టం లేకపోతే కాలను. అయినా నేను కాలతానా?..కాలనా? అన్న సంగతి మీకెందుకండీ?"

"హలో..బాబూ! అపార్థం చేసుకోకండి? ఇప్పుడూ..కొత్తగా మొదలెట్టిన ప్రోగ్రాముకు ముందుగా కాల్ చేసారు కనుక 'కాలరు' అంటున్నా. అంటే మా ఈ ప్రోగ్రాముకు ముందుగా ఫోను చేసిన వారు మీరన్నమాట."

"హలో..ముందుగా ఫోనుచేసినవాడివి నీవేనయ్యా అంటే చక్కగా అర్థమవుతూనేవుంది కదండీ, దాని భాగ్యానికి, కాలరూ, కాలతారూ ఎందుకండీ మీదిమరీ చోద్యం?"

"హలో..బాబూ..ఇంతకీ ఎవరు మాట్లాడుతున్నారూ!?"

"హలో..నాతో అందరూ మాట్లాడతారండీ! నాకు ఎవరితోనూ విరోధం లేదు. నేను తగాదాలమారినని అనుకుంటున్నారేమో..ఎబ్బెబ్బే అలాటిదేమీ లేదండీ?"

"హలో..బాబూ..నేనడిగేదీ..నాతో మాట్లాడుతున్నదెవరని?"

"హలో..ఎవరు మాట్లాడుతున్నారో నాకేం తెలుసండీ? అయినా..మీతో మాట్లాడేవాళ్లెవరో నాకెలా తెలుస్తుంది చెప్పండి?"

"హలో..నాతో మాట్లాడుతోంది మీరేకదండీ బాబూ! మీ పేరేమిటని అడుగుతున్నా!"

"హలో..నీ పేరేంటయ్యా అని అడిగితే సరిపోతుంది కదండీ, దానిగ్గానూ..ఎవరు మాట్లాడుతున్నారూ, ఎవరు మాట్లాడటం లేదూ అంటారెందుకూ?"

"హలో..బాబూ తప్పయిపోయింది. క్షమించండి. ఇప్పుడు చెప్పండి. మీ పేరేమిటో?"

"హలో..ఇంత భాగ్యానికే అంత పెద్ద మాటలెందుకులెండి? నా పేరు 'నేత్రయ్య' ఇంతకూ అది కళ్ల కలకేస్వరరావుగారి కార్యక్రమమేనా, కాదా?"

"హలో...చూడండి బాబూ నేత్రయ్యగారూ, ఇది కళ్ల కలకేస్వరరావుగారి ప్రోగ్రాం కాదు. ఒకవేళ మీరు కావలసినవారి పేరు కనకేశ్వరరావో, కలకేశ్వరరావో అనుకుందాం. అనుకుందాం ఏమిటిలెండి అదే అయివుంటుంది. ఈ రెంటిలో ఏదైనప్పటికీనీ 'శ్వ' అని అనాలి తప్ప 'స్వ' అని అనకూడదు. ఈ విషయం నాకెలా తెలుసంటారేమో. నేను 'ఈక్షణం' రేడియోకి అనుబంధంగా వున్న పేపరులో పనిచేస్తున్నాలెండి. డెప్యుటేషను మీద ప్రస్తుతం రేడియో సెక్షనులో పనిచేస్తున్నానన్నమాట. అందుకని చెప్పగలుగుతున్నాను"


"హలో..అలాగాండీ, కళ్ల ఈశ్వరరావుగారనీ గొప్ప సంగీతజ్ఞులున్నారుట. వారి స్వరాలు వింటుంటే ఎంతటివారికైనా కళ్లు మూతలుపడి నిద్రొచ్చి మంచి మంచి కలలొస్తాయట. కళ్లకు నిద్ర వచ్చేటట్లుగానున్నూ, ఆపైన, మంచి మంచి కలలొచ్చేటట్లుగానున్నూ స్వరాలు కూర్చుతారు గనుక వారిని వారి దగ్గరివారూ, అభిమానులూ, 'స్వ'రరావనీ 'కలకే'స్వర' రావనీ అంటారట. ఇది వారి ప్రోగ్రాము కాబోలని అలా అడిగానన్నమాటండి. ఇంతకూ అది 'ఈక్షణం' రేడియోయేనా? కాదా?"

"హలో..బాబూ ఇది 'ఈక్షణం' రేడియోనే..ఎందుకలా అడిగారు, మునుముందుగా మీరాప్రశ్న వేస్తే అవుననే సమాధానం చెప్పాను గదా!"

"హలో..మరలాగయితే అది 'స్వరాలూ-సంగతులూ' అనే కార్యక్రమం కాదన్నమాట. నేను పొరబడ్డానన్నమాట!?"

"హలో...చూడండి బాబూ, నేత్రయ్యగారూ మీరు-హృదయపూర్వకంగా, పరిపూర్ణంగా, ఏకగ్రీవంగా, ఆదర్శప్రాయంగా, నిష్కళంకంగా, పొరపాటు లేకుండా పొరబడ్డారని చెప్పటానికి నేను మిక్కిలి ఆనందిస్తున్నానండీ"

"హలో..ఆనందిస్తున్నారా? దేనికండీ మీకంత సంబరం! అయినా ఏకగ్రీవంగా, పరిపూర్ణంగా, నిష్కళంకంగా, అంటూ ఏమిటదీ? ఎందుకండీ ఆ



భాష?"

''హలో..చ దాద ండీ బాబూ..నేత్రయ్యగారూ..ఆ భాష ఎందుకంటే ఏం చెపుతాం? పదాలు బావున్నాయి కదా! అని వాడతాం, మీరు ఆ పదాడంబరానికి ముగ్ధులవ్వాలని అలా వాడతాం! కళ్ల ఈశ్వరరావుగారు నిర్వహించిన 'స్వరాలు-సంగతులూ' అనే ప్రోగ్రాము నిన్ననే అయిపోయింది. ఇది 'ప్రతి రోజూ-ప్రతిరోగి' అనే ప్రోగ్రాములో. డాక్టరు నయనానందరావుగారు నిర్వహిస్తున్న 'కళ్లూ-కలకలూ' అనే ప్రోగ్రాం. ఇక ఆనందమెందుకంటారా? చెప్పాను కదా! మేము ప్రతిష్టాత్మకంగా భావించి, ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ప్రోగ్రాముకు మీరే మొదటి కాలరు అని, అదేలెండి మొదటగా ఫోను చేసినవారు, మొదటి ఫోనే రాంగు అనిపించుకోకూడదని నా ప్రగాఢమైన మరియు తీవ్రమైన ఆకాంక్ష. ఈ ప్రోగ్రామును మీకు సమర్పిస్తున్న 'చెవినిండా' టెలిఫోను కంపెనీవారు వారి గిఫ్టు హాంపరును మీకు త్వరలోనే అందిస్తారు.

కాబట్టి 'కళ్లూ-కలకలూ' అనే ఈ ప్రోగ్రాములో కళ్లకూ కలకలకూ సంబంధించి మీ సందేహాలకూ, సమస్యలకూ డాక్టరుగారు ఇప్పటికిప్పుడే సమాధానాలిస్తారు. అడగడమే ఇక మీ వంతు"

"హలో..నేను స్వరాలూ సంగతులూ కార్యక్రామానికన్న వుద్దేశంతో ఫోను చేశాను. కానీ మీరేమో కళ్లకు సంబంధించిన ప్రశ్నలడగమంటున్నారు. సరే...డాక్టరుగారూ..మరయితే..ఎవరికైనా"

"హలో నేత్రయ్యగారూ..నేత్రయ్యగారూ..అలాక్కాదు, అలాక్కాదు..ముందుగా మీ వయసెంతో చెప్పండి దాన్నిబట్టి డాక్టరుగారు ఇప్పటికిప్పుడే సమాధానాలిస్తారు"

"హలో..ఏమోనండీ నాకెన్నేళ్లో సరీగా తెలియదండీ. ఏదో ఈ తఫా కిలాకానివ్వండి? మరోసారి నా వయసెంతో చెపుతాను"

"హలో..అలా కుదరదండీ పోనీ ఎప్రాక్సుమేటుగానైనా మీ వయసు...ఆగండాగండి డాక్టరుగారేదో అంటున్నారు, అలాగంటారా..సరేసరే మీరెలాగంటే అలా..ఆ నేత్రయ్యగారూ డాక్టరుగారు మిమ్మల్ని ప్రశ్నలడగమంటున్నారు, అడగండి"

"హలో..డాక్టరుగారూ ఎవరికైనా రెండు కళ్లుంటాయి కదా మరలాటప్పు..."


"హలో..ఔనండీ, ఎవరికైనా విధిగా రెండుకళ్లుంటాయి. ఇంతమాత్రానికి అందునా ఇంత చిన్న ప్రశ్నకు డాక్టరుగారే జవాబు చెప్పాలాయేమిటండీ?

బాబూ..నేనయినా సరిపోతాను కదా!"

"హలో..మా సందేహాలను డాక్టరుగారు తీరుస్తారని చెప్పి జవాబు మీరు చెపుతారేంటండీ? అలాగయితే దీనిక్కూడా సమాధానం మీరు చెప్పగలరేమో చూడండి. ఎవరికయినా విధిగా రెండు కళ్లుండే మాట నిజమే గనుకైతే పురాణాల లోని 'శివుడి'కి మూడు కళ్లెందుకున్నాయి చెప్పండి"

"హలో..అది పురాణాల కాలము నాటి దిన్నీ, పురాణాలలోనిదిన్నీ కనుక నిజనిర్ధారణ కష్టమండీ నేత్రయ్యగారూ, అసలావిషయాన్ని చూచినవారెవరున్నారు చెప్పండి? కనుక ఈ కలికాలంలో అందునా ఈ ఆధునిక కాలంలో అలాటివి సాధ్యం కాదు. కనుక ఎవరికైనా విధిగా రెండు కళ్లే వుంటాయి. ఉండాలి కూడాను. మీకీ సమాధానం సంతృప్తినిచ్చిందనే భావిస్తున్నాను."

"హలో..అయ్యా! మీరిచ్చిన ఆ సమాధానం నాకు సంతృప్తినివ్వలేదు. అంతేగాదు ఇప్పుడు నేను రామాయణంలో కబంధుడికి ఒకే ఒక కన్నుంది గదా అని అడిగినా, రాక్షస గురువైన శుక్రాచార్యుడికి ఒకే కన్నుంటగదా అని అడిగినా మీరు మళ్లాపై సమాధానాన్నో లేకపోతే అలాటిదే మరోదాన్నో చెపుతారు గనుక మరో ప్రశ్నడుగుతాను."




"హలో..దానిదేముంది అడగండి. ఆ ప్రశ్నకు ఇప్పటికిప్పుడే డాక్టరుగారు సమాధానమిస్తారు!"


"హలో..అయ్యా! అసలు ప్రశ్న అడగబోయే ముందు అడిగే ఈ ప్రశ్నకు కూడా దయచేసి మీరే సమాధానం చెప్పండి. మీరు సంధానకర్తగా పనిచేస్తున్న తొలిపెద్ద కార్యక్రమం ఇదేననుకుంటానే? నిజమేనా?"

"హలో..నేత్రయ్యగారూ..మీరన్నది నిజమే. నేను యాంకరుగా పనిచేసిన వాటిలో ఇదే అతిపెద్ద ప్రోగ్రాము. ఈ విషయం మీరెలా కనిపెట్టగలిగారో గానీ, మీ తెలివితేటలను అభినందించడానికి ప్రస్తుతం నా దగ్గర మాటలు లేవంటే మీరు నమ్ముతారనే నేను నమ్ముతున్నాను.."

"హలో..అయ్యా..ఆవుధ్య మావూరాయనొకడు, ఒరే మనకు ఉండటానికి రెండు కళ్లున్నా, ఇక పైన కుడికన్నుకూ..ఎడమకన్నుకూ కూడా వేరు వేరు డాక్టరులు ఉంటారు చూసుకో అని హాస్యానికన్నాడు. భవిష్యత్తులో అలా జరగొచ్చంటారా?"

"హలో..నేత్రయ్యగారూ, ఈ ప్రోగ్రాముకుగానూ 'చెవినిండా' టెలిఫోనువారికి కేటాయించిన టైము అయిపోయిన కారణంగా మీ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నందుకు మా నిలయం తరపున విచారాన్ని వ్యక్తం చేస్తున్నాము"

శ్రోతలకు ఒక గమనిక:- 'ఈక్షణం' రేడియో తరపున ప్రయోగాత్మకంగానూ, ప్రతిష్ఠాత్మంగానూ, మొదటిసారిగా నిర్వహిస్తున్న 'ప్రతిరోజూ-ప్రతిరోగీ' అనే కార్యక్రమంలో భాగంగా 'కళ్లూ-కలతలూ' అనే ప్రోగ్రాముకు సంబంధించిన రెండవ భాగం వచ్చే వారం ఇదే సమయంలో ఇదే మీటర్లపై ప్రసారం చేయబడుతుంది. శ్రోతలకు గల సందేహాలకూ, సమస్యలకూ, డాక్టరు నయనానందరావుగారు అప్పటికప్పుడే సమాధానాలిస్తారు. ప్రకటన సమాప్తం.



## దశ తిరిగేనా?

హిందీ 'ఘర్షణ' రీమేక్ హీరోయిన్ చాన్సు కొద్దిలో చేజార్చుకుంది అశిన్ అనే వార్తలొచ్చిన నేపథ్యంలో- 'ఈ సినిమా నాకు రానందుకు నేనేమీ బాధం పడడం లేదు. ఇంకో విశేషం ఏంటంటే- నేను సల్మాన్‌తో మరో సినిమాలో నటించబోతున్నాను' అంటూ ఆనందంగా చెబుతోంది అశిన్. బాలీవుడ్‌లో అశిన్ కెరీర్ దూసుకెళుతుందని ఎన్నో అంచనాలు సాగాక- ఆమెకి నిరాశ కలిగించే విధంగా ఆఫర్లు లేకుండా పోయాయి. అయితే ఇప్పుడు సల్మాన్‌తో కలిసి నటించే అవకాశం వచ్చింది కాబట్టి మళ్లీ అశిన్ హిందీ కెరీర్ పుంజుకుంటుందేమో!